క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం శివప్రసాద్

ఆలూరు: మండలంలోని హత్తిబెళగళ్ గ్రామ జెడ్పీ పాఠశాల 9వ తరగతి విద్యార్థి కె.వరుణ్ ఉమార్, పి.మౌలాహుసేన్ ఈ నెల 26, 27వ తేదీల్లో నందికొట్కూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి సెపక్ తక్రా పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం శివప్రసాద్ శుక్రవారం తెలిపారు. విద్యార్థులు ఈనెల 21న కర్నూల్‌లో జరిగిన ఎంపిక పోటీల్లో ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారని చెప్పారు. పీఈటీ చిన్న బాబు, విద్యార్థులను అభినందించారు.

పశువులకు రేబిస్ వ్యాక్సిన్లు



పీ.కొత్తూరులో పశువులకు రేబిస్ వ్యాక్సిన్లు వేస్తున్న పశువైద్య సిబ్బంది

తుగ్గలి : నాలుగు రోజుల క్రితం పిచ్చికుక్క కాటుకు పీ.కొత్తూరులో ఆరు పశువులు మృత్యువాత పడ్డాయి. దీంతో ముందస్తు జాగ్రత్తగా శుక్రవారం గ్రామంలోని పశువులకు జొన్నగిరి పశు వైద్యాధికారి బాలకృష్ణ, సిబ్బంది పశువులకు రేబిస్ వ్యాక్సిన్లు వేశారు. రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పశువైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పీర్‌బాషా, భాగ్యలక్ష్మి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలి



శిక్షణ పొందిన ఏఓ, ఏఈఓలతో డీఏఓ వరలక్ష్మితో సిబ్బంది

పత్తికొండ(తుగ్గలి) : రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని వ్యవసాయశాఖ జిల్లా అధికారిణి పి.వరలక్ష్మి సూచించారు. పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్‌లో విత్తనాలు, ఎరువుల నాణ్యతపై ఏఓ, ఏఈఓలకు రెండు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. మాస్టర్ ట్రైనర్ వేదానందం, రామాంజనేయులు, అనంతపురం ఎఫ్‌సీవోలు సరస్వతి, జ్ఞానేంద్రముని శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన ఏఈఓలకు డీఏఓ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏడీఏ మోహన్‌విజయ్, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



ఆస్పరి: మండల కేంద్రంలో మారెమ్మవ్వ, రామతీర్థంలో వెలసిన గాయత్రీ మాత, జొహరాపురంలో పెద్దమ్మవ్వ ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రూపా మోహన్ శర్మ, గోవిందు, సతీష్ ఆచారి ఆధ్వర్యంలో అమ్మ వార్లకు కుంకుమార్చన, హోమాలు, మంగళహారతులు తదితర కార్యక్రమాలు జరిపించారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

సీసీ రోడ్డు నిర్మాణం పరిశీలన



రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డీఈ మనోహర్, అధికారులు

హాలహర్వి: స్థానిక దుర్గమ్మ గుడి నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణాన్ని ఆలూరు పీఆర్ డీఈ మనోహర్ శుక్రవారం పరిశీలించారు. సీసీ రోడ్డు కొలతలు, నిర్మాణంలో నాణ్యతపై ఆరా తీశారు. డీఈ మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ రోడ్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. సీసీ రోడ్ల నిర్మాణాల్లో కాంట్రాక్టర్లు నాణ్యత పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్పంచ్ మల్లికార్జున, మండల పీఆర్ ఏఈ సోమప్ప ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కృష్ణగిరి: కంబాలపాడు సబ్‌స్టేషన్ పరిధిలోని పెనుమాడ ఫీడర్ కింద శనివారం ఉయదం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ మద్దిలేటి శుక్రవారం తెలిపారు. ఉదయం 6 నుంచి 10 గంటలకు వరకు, అలాగే మధ్యాహ్నం 2 నుంచి రైతులకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని చెప్పారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

అక్రమార్కుల జేబులు నిండుతున్నాయ్!

- పేదల కడుపు నింపని రేషన్ బియ్యం
- యథేచ్ఛగా అక్రమ రవాణా
- గుట్టుచప్పుడు కాకుండా ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్న వైనం
- పట్టించుకోని యంత్రాంగం



చిప్పగిరి వద్ద స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం (ఫైల్) ,



జొహరాపురంలో విజిలెన్స్ అధికారులు పట్టుకున్న 64 క్వింటాళ్ల రేషన్ బియ్యం (ఫైల్)

చిప్పగిరి: నిరుపేదలు ఆకలితో అలమటించరాదని, వారు కూడా మూడు పూటలా భోజనం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చౌకదుకాణాల ద్వారా రేషన్ బియ్యం అందజేస్తుంది. అయితే ఆ బియ్యాన్ని కొందరు పేదల నుంచి కొనుగోలు చేసి అక్రమ మార్గాల ద్వారా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు గ్రామాలు, పట్టణాల్లో వీధుల్లో తిరిగి బియ్యం సేకరించి దళారులకు అప్పగిస్తే.. వారు ఆ బియ్యాన్ని మరో వ్యక్తికి అప్పగిస్తున్నారు. చివరకు రేషన్ బియ్యం పేదల నుంచి దూరంగా తరలిపోతోంది. అయినప్పటికీ అక్రమార్కులు మాత్రం సొమ్ము చేసుకుంటున్నారు.

ఒకరికి ఐదు కిలోల చొప్పున..

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో రేషన్ కార్డులో వ్యక్తికి 5 కిలోల చొప్పున కార్డులో ఎంత మంది కుటుంబ సభ్యులుంటే అంత మందికి రేషన్ బియ్యాన్ని ప్రభుత్వం అందిస్తుంది. అయితే గత కొన్ని సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వ సహకారంతో రేషన్ కార్డు దారులకు భియ్యం ఉచితంగా ప్రభుత్వం అందిస్తుంది. మండలంలో మొత్తం 7,885 రేషన్ కార్డులుండగా నెలకు 1211.56 క్వింటాళ్ల బియ్యం ప్రభుత్వం కేటాయిస్తోంది. అయితే అధిక శాతం మంది రేషన్ బియ్యం వినియోగించదానికి ఇష్టపడకపోతుండటంతో వారి నుంచి కొనుగోలుదారులు కిలో రూ.10, రూ.12, రూ.15, రూ.17 ప్రకారం ఇష్టానుసారంగా చెల్లించి కొనుగోలు చేసి వారు మధ్య దళారికి అమ్ముకుంటారు. కాగా కేజీ బియ్యం అందించడానికి ప్రభుత్వం దాదాపు రూ.35 ఖర్చు చేస్తుండగా.. అక్రమార్కులు మాత్రం రూ.17 ప్రకారం కొనుగోలు చేస్తున్నారు. దీంతో పేదల ఆకలి తీర్చాల్సిన బియ్యం అక్రమార్కుల జేబులు నింపుతోంది.

సరిహద్దులు దాటుతున్న బియ్యం..

గ్రామాల నుంచి సేకరించిన బియ్యాన్ని కొందరు ముఠాగా ఏర్పడి వాటిని గుట్టుచప్పుడు కాకుండా ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అయితే తరలింపుపై అధికారులకు సమాచారం ఉన్నప్పటికీ చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలో రేషన్ పంపిణీ చేసిన తొలి వారంలో కొందరు అక్రమార్కులు గ్రామాలు తిరిగి కొనుగోలు చేసి గ్రామాల్లో ఎంచుకున్న రహస్య ప్రాంతాల్లో నిల్వ చేసి ఒక లోడ్ అయిన తరువాత ఎవరి కంట పడకుండా రాష్ట్ర సరిహద్దు దాటిస్తున్నారు. ఈ తతంగమంతా బహిరంగంగానే జరుగుతున్నా అధికారులు తమకేమీ తెలియదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. పలు గ్రామాల్లో కొందరు రేషన్ డీలర్లుఈ అక్రమ రవాణాకు సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం వాహనాలను పలుమార్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నప్పటికీ తతంగానికి మాత్రం అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ఇలా తరలించిన బియ్యం అధికంగా కోళ్ల ఫారాలకు విక్రయిస్తున్నారని, నిర్వాహకులు ఆ బియ్యాన్ని నూకగా మార్చి కోళ్లకు దాణాగా వేస్తున్నారు. అలాగే.. ఇంకొందరు మిల్లులకు తరలించి సన్నంగా మార్చి సోనామసూరిలో కలిపి విక్రయిస్తున్నారు.

ప్రత్యేక నిఘా ఉంచాం



ప్రభుత్వం అందించే రేషన్ బియ్యాన్ని అక్రంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవు. బియ్యం తరలించినా, వారికి సహకరించిన వారిపై కూడా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. రేషన్ బియ్యం తరలించ కుండా గ్రామాల్లో గట్టి నిఘా ఉంచాం. గ్రామాలలో ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం. మండలంలో ఎలాంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలు జరుగకుండా పటిష్ట చర్యలు చేపట్టాం. – సతీష్ కుమార్,ఎస్ఐ

రేషన్ బియ్యం అమ్మినా, కొన్నా నేరమే



రేషన్ బియ్యం అమ్మినా, కొనుగోలు చేసినా నేరమే. ప్రభుత్వం కేజీకి రూ.35 చెల్లించి పేదల ఆకలి తీర్చడానికి ప్రతి నెల రేషన్ కార్డు దారులకు పంపిణీ చేసే రేషన్ బియ్యం అమ్మడం తప్పు. విచారణ చేసి రేషన్ అమ్మే లబ్ధిదారులను గుర్తించి వారి రేషన్ కార్డులు రద్దు చేస్తాం. రేషన్ బియ్యంలో అత్యధిక పోషక విలువలు ఉన్నాయి. రేషన్ బియ్యం ఉపయోగాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. రేషన్ అక్రమ రవాణా జరగకుండా గ్రామాల్లో తనిఖీలు నిర్వహిస్తాం. ఇలాంటి చర్యలు తమ దృష్టికి వస్తే చట్టప్రకారం చర్యలు తప్పవు.

– ఇజాజ్ అహమ్మద్, తహసీల్దార్, చిప్పగిరి

రేపు కమ్మ సంఘం వన సమారాధన

పత్తికొండ(తుగ్గలి) : కాకతీయ కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన పత్తికొండలో కార్తీక వన సమారాధాన ఏర్పాటు చేసినట్లు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వేలూరు రామప్ప, ప్రధాన కార్యదర్శి జరగల రాంబాబు, ట్రెజరర్ బైరపు వైకుంట ప్రతాప్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదోని–గుత్తి బైపాస్ రోడ్డులోని రమ్య రిసార్ట్‌లో వన భోజన మహోత్సం ఏర్పాటు చేశామన్నారు. ఆత్మీయ కలయికలో కమ్మ కులస్తులు కుటుంబ సభ్యులతో సహా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేపు రైతుల వనభోజనం

మద్దికెర : ఎన్నో ఆశలతో పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం అయన మాట్లాడుతూ ఈనెల 24వ తేదీన పత్తికొండ సమీపంలో మండగిరిలోని రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన రైతు కార్తీక వనభోజనంలో మండలంలోని రైతులందరూ పాల్గొనాలని కోరారు. వనభోజనం అనంతరం ప్రజలందరికీ అన్నంపెట్టే అన్నదాతలకు వ్యవసాయంపై నిపుణులు సలహాలు, సూచనలు ఇస్తారని చెప్పారు. ఎంసీవి ప్రసాద్, దాసరి శ్రీనివాసులు, రామచంద్రయ్య హాజరవుతారని రైతులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేవారు.

పత్తికొండ(తుగ్గలి) : ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన ఆర్. మండగిరి రామలింగేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో కార్తీక వన సమారాధన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు సంఘం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఉమాపతి, సురేంద్రకుమార్ శుక్రవారం తెలిపారు. ముఖ్య అతిథులుగా వ్యవసాయరంగ నిపుణులు ఎంసీవీ ప్రసాద్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దాసరి శ్రీనివాసులు, రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రామచంద్రయ్య హాజరవుతారన్నారు. రైతుంతా హాజరు కావాలని కోరారు.

రేపు వాల్మీకుల వనభోజనం

దేవనకొండ: ఆలూరులోని బెళ్లిగుండు ఆంజనేయ స్వామి దేవాలయంలో ఈనెల 24వ తేదీన వాల్మీకి వనభోజన కార్యక్రమం ఉంటుందని వాల్మీకి సంఘం సీనియర్ నాయకుడు కప్పట్రాళ్ల మల్లికార్జున శుక్రవారం తెలిపారు. వాల్మీకులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పంటల బీమా ప్రీమియం చెల్లించండి

చిప్పగిరి: రబీలో సాగు చేసిన పంటలకు బీమా ప్రీమియం చెల్లించాలని ఏఓ విజయలక్ష్మి సూచించారు. శుక్రవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో ఆమె మాట్లాడుతూ పప్పుశనగకు ఎకరాకు గ్రామ యూనిట్ లెవల్‌కు రూ.420, వరికి మండల యూనిట్ లెవల్‌కు రూ.630, జొన్నకు మండల యూనిట్ లెవల్‌కు రూ.297, వేరుశనగకు మండల యూనిట్ గా రూ.480, ఉల్లికి జిల్లా యునిట్‌గా రూ.1,350, టమాటకు మండల యూనిట్ లెవల్‌కు రూ.1,500 చొప్పన ప్రీమియం చెల్లించాలని చెప్పారు. ప్రీమియం చెల్లింపునకు డిసెంబర్15వ తేదీ ఆఖరని చెప్పారు.

వేతనాలు చెల్లించాలి

పత్తికొండ(తుగ్గలి) : స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించేలా చూడాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్‌బాషాకు బీజేపీ నాయకులతో కలిసి అసెంబ్లీ కో కన్వీనర్ గోవర్ధననాయుడు విజ్ఞప్తి చేశారు. డివిజన్ స్థాయి సమీక్ష సమావేశానికి శుక్రవారం పత్తికొండకు వచ్చిన కలెక్టర్‌ను కలిసి వారు వినతి పత్రం అందజేశారు. వేతనాలు సక్రమంగా రాకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు దండి మల్లికార్జున, పునామల్లికార్జున, బ్రహ్మయ్య, రామాంజనేయులు పాల్గొన్నారు.

నేడు సత్యసాయిబాబా జయంతి

వెల్దుర్తి(కృష్ణగిరి): స్థానిక శ్రీరాముల దేవాలయంలో శనివారం భగవాన్ సత్యసాయిబాబా 99వ జయంతి నిర్వహిస్తున్నట్లు సత్యసాయిబాబా భజన మండలి సభ్యులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 5:30 గంటలకు నగర సంకీర్తన, 6:30 గంటలకు పతాక ఆవిష్కణ, 11 గంటలకు భజన పూజ కార్యక్రమం, మధ్యాహ్నం 1 గంటకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

వెల్దుర్తి(కృష్ణగిరి): మారుమూల గ్రామంలోని ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తూ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు సాధించడం సంతోషంగా ఉందని గ్రామ పెద్ద, పాఠశాల స్థల దాత నర్సింగ్ కాంతరెడ్డి, ఎంఈఓలు ఇందిర, రమేష్ పేర్కొన్నారు. మండలంలోని ఎస్. బోయినపల్లె గ్రామంలో శుక్రవారం గ్రామస్తులు నిర్వహించిన వన భోజనంలో పాల్గొని అనంతరం గ్రామంలోని పాఠశాలలో విధులు నిర్వహిస్తూ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న ఖాజాబేగ్ దంపతులను గ్రామస్తులు మేళాతాళాలతో గ్రామంలో ఊరేగించారు. పాఠశాల అభివృద్ధికి మరో రూ.10 లక్షల వరకు సాయం చేస్తానని కాంతరెడ్డి ప్రకటించారు. హెచ్ఎంలు వెంకటేశ్వర్లు,జనార్ధన్‌శెట్టి, శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఎస్. బోయినిపల్లెలో ఖాజాబేగ్ దంపతులను ఊరేగిస్తున్న దృశ్యం

నేడు కార్తీక దీపోత్సవం

హొళగుంద: మండల కేంద్రం సమీపంలోని తెల్ల కొండ వద్ద వెలసిన అగ్రహార ఆంజనేయస్వామికి కార్తీక శనివారం సందర్భంగా రాత్రి ఆలయ సేవా సమితి ఆధ్వర్యంలో దీపోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు జరుగుతాయని, రాత్రి ఆలయం, ఆలయ ఆవరణలో దీపోత్సవ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. అలాగే అన్నదానం, భజన ఉంటుందని పేర్కొన్నారు.

సమ్మతగేరిలో కుక్కల బెడద

హొళగుంద: మండలంలోని సమ్మతగేరి గ్రామంలో కుక్కల బెడద తీవ్రమైందని గ్రామస్తులు వాపోతున్నారు. పది రోజుల క్రితం నాగప్ప అనే వ్యక్తిపై దాడి చేసి గాయపరిచాయి. రాత్రి సమయంలో బయట వెళ్లాలంటే భయమేస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులను పంపలేకపోతున్నామని చెబుతున్నారు. వీధుల్లో, ప్రధాన కూడలిలో తిరుగుతున్న కుక్కలు ఉన్నట్టుండి దాడి చేస్తున్నాయని వాపోతున్నారు. అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



సమ్మతగేరిలో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

క్యాన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తో సాధ్యం

మద్దికెర : ముందస్తు పరీక్షల ద్వారా క్యాన్సర్ నుంచి కాపాడుకోవచ్చని హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా అన్నారు. శుక్రవారం మండలంలోని బురుజుల గ్రామంలో క్యాన్సర్‌పై ర్యాలీ నిర్వహించి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ వైద్యాధికారులు రాగిణి, శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు ఇంటి వద్దే క్యాన్సర్ పరీక్షలు నిర్వహించి క్యాన్సర్ పై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

25న లక్ష దీపోత్సవం

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తిలోని జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో ఈ నెల 25వ తేదీన కార్తీక దామోదర లక్ష దీపోత్సవాన్ని ఇస్కాన్- అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం కర్నూలు వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీపీ ఎల్ఈ జ్ఞానేశ్వరగౌడ్ శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. 25న సాయంత్రం 4 గంటలకు వీఎం సురేష్ ఆర్కెస్ట్రా వారి భక్తి గీతా ఆలాపనతో కార్యక్రమం ప్రారంభమవుతుందని, 6 గంటలకు సంధ్య హారతి, ఇస్కాన్ భక్తుల హరినామ సంకీర్తన, 6:30 గంటలకు రూపేశ్వర చైతన్యదాస్, ఇస్కాన్ మందిర ఉపాధ్యక్షుడుతో దామోదరలీల ప్రవచనం ఉంటుందని తెలిపారు. 7:30 గంటలకు దామోదర హారతి, కార్తీక దామోదర లక్ష దిపోత్సవం నిర్వహిస్తామన్నారు. 8 గంటలకు అన్నదానం ఏర్పాటు చేశామని చెప్పారు.

బస్సు కోసం విద్యార్థుల పడిగాపులు





సుళువాయి రోడ్డులో విద్యార్థి బస్సు కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు

హొళగుంద: మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం సుళువాయి, సమ్మతగేరి, పెద్దహ్యాట తదితర గ్రామాలకు చెందిన విద్యార్థులు విద్యార్థి బస్సు కోసం గంటల తరబడి పడిగాపులు కాశారు. ఆయా గ్రామాలకు చెందిన దాదాపు 80 మంది విద్యార్థులు రోజూ హొళగుంద హైస్కూల్, జూనియర్ కాలేజీకి వస్తుంటారు. పాఠశాల వేళలకు రావాల్సిన విద్యార్థి బస్సు ఆలస్యంగా రావడం, ఒక్కో రోజు అసలుకే రాక పోతుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాల్లో వెళ్తుండగా.. మిగిలిన వారు హొళగుంద బస్టాండు, సుళువాయి రోడ్డులో బస్సు కోసం వేచి చూస్తున్నారు.



చీకటి పడుతున్న సమయంలో వస్తున్న విద్యార్థి బస్సు

పాఠ్యాంశాలు అర్థమయ్యేలా బోధించాలి



ఆస్పరి: విద్యార్థినులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యేలా బోధించాలని డీఈఓ శామ్యూల్ పాల్ ఉపాధ్యాయినులకు సూచించారు. శుక్రవారం స్థానిక కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థినులు, ఉపాధ్యాయినులతో మాట్లాడారు. 10వ తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని చెప్పారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తేవాలన్నారు.

ఆస్పరి కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈఓ శామ్యూల్ పాల్

సారా విక్రేతల అరెస్టు

కృష్ణగిరి: మండలంలోని అమకతాడు గ్రామానికి చెందిన ఇద్దరు సారా విక్రేతలను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. గ్రామ శివారులోని కర్లకుంట రోడ్డులో సారా అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేయగా గ్రామానికి చెందిన అనుగొండ రామానాయుడు, చెరుకులపాడు రామాంజినమ్మను అదుపులోకి తీసుకుని వారి నుంచి 7 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారని ఎస్ఐ వివరించారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

ఆస్పరి: మండలంలోని జొహరాపురం గ్రామ సమీపంలో శుక్రవారం పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు సీఐ మస్తాన్‌వలి తెలిపారు. పేకాట ఆడుతున్నారనే సమాచం మేరకు పేకాట జొహరాపురంలో దాడి చేసి 7బైకులు, 5సెల్ ఫోన్లు, రూ. 22వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని చెప్పారు.

ప్రతి విద్యార్థికి అపార్ నమోదు చేయాలి



అపార్ నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

ఆదోని రూరల్: ప్రతి విద్యార్థికి అపార్ నమోదు చేయాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన అపార్ నమోదు కేంద్రం, యూనియన్ బ్యాంకులో ఉన్న ఆధార్ నమోదు కేంద్రాన్ని తహసీల్దార్, ఎంఈఓలతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు అపార్ నమోదు చేయడంలో ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా చేపట్టాలన్నారు. మండలంలో రిజెక్షన్ (ఫెయిల్డ్) 7,104 దరఖాస్తులు ఉన్నాయన్నారు. రిజెక్షన్‌లో పేరు, వయస్సు, జెండర్ తప్పులను ఉన్న వాటిని ఉపాధ్యాయులు, గ్రామంలో ఉండే పంచాయతీ కార్యదర్శితో నివృతి చేసుకుని సరి చేయాలన్నారు. ఆధార్ అప్‌డేషన్ సంబంధించి ముందుగా స్కూల్‌ను మ్యాపింగ్ చేసుకోవాలన్నారు.

● చల్లగా.. హాయిగా..



దట్టంగా పెరిగి నీడను ఇస్తున్న చెట్లు

మద్దికెర : స్థానిక ఎంఈఓ కార్యాలయం ముందు గతేడాది ఎంఈఓ రంగస్వామి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని మొక్కలు నాటి వాటిని సంరక్షించడంతో పాటు కూర్చొడానికి బండలు వేయించారు. ఆ మొక్కలు నేడు చెట్లుగా మారడంతో వివిధ పనులు మీద ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చిన వారంతా చెట్లు నీడన ఏర్పాటుచేసిన బెంచీలపై కూర్చొని సేదతీరుతూ చల్లగా హాయిగా ఉందంటూ కితాబు ఇస్తున్నారు. ఆ ప్రాంతంలో ఎంపీడీఓ, హౌసింగ్, సచివాలయం, ఆధార్ కేంద్రం, ఉపాధి, స్త్రీ శక్తి భవనం ఉండడంతో వివిధ పనులపై వచ్చిన వారు వేచి ఉండేందుకు చెట్లు కిందకు చేరుతున్నారు.

● కంప చెట్లు తొలగించరూ!



అమినాబాద్-పగిడిరాయి మధ్య మలుపులో పెరిగిన తుప్పలు,



గిరిగెట్ల లింగాల వంక బ్రిడ్జికి ఇరువైపుల కంపచెట్లు

తుగ్గలి : అమినాబాద్–పగిడిరాయి గ్రామాల మధ్య రహదారికి ఇరువైపులా దట్టంగా పెరిగిన తుప్పలు, పిచ్చిమొక్కలతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వీటి వల్ల ఎదురుగా వచ్చే వాహనాలకు దారి ఇవ్వడం సమస్యగా మారింది. మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాన్ని గుర్తించలేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు వాపోతున్నారు. అలాగే..గిరిగెట్ల లింగాల బ్రిడ్జికి ఇరు వైపులా, జొన్నగిరి, రాతన చెరువు కట్టలకు ఇరువైపులా కంపచెట్లు పెరిగి రోడ్డు మీదకు రావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్స్ చేసేలా చర్యలు చేపట్టాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు

కృష్ణగిరి: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు రోజులు ఆయా గ్రామాల బీఎల్ఓలు వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి ఫారం–6, 7, 8లను స్వీకరిస్తారన్నారు. 2025 జనవరి నాటికి 18ఏళ్లు పూర్తయ్యే యువతీ యువకులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, అలాగే మార్పులు, చేర్పులు చేసుకునే వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఓటరు నమోదుకు ప్రత్యేక క్యాంపులు

మద్దికెర : 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు శని, ఆదివారాల్లో రెండు రోజులు పాటు ప్రత్యేక క్యాంపులు నిర్వహించి నమోదు చేయాలని తహసీల్దార్ హుసేన్‌సాహెబ్ శుక్రవారం తెలిపారు. గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లలో శనివారం, ఆదివారం రెండు రోజుల పాటు పోలింగ్ బూత్ ఆఫీసర్లు అందుబాటులో ఉండి నమోదు చేసుకుంటారని, అర్హత కల వారు వయస్సు నిర్ధారణ ధ్రువపత్రాలు బీఎల్ఓలకు అందజేసి నమోదు చేయించుకోవాలని కోరారు.